

ఉమ్మడి జిల్లాలో అత్యల్ప ఉష్ణోగ్రతలు



జిల్లా	ప్రాంతం	ఉష్ణోగ్రత (డిగ్రీల్లో)
వికారాబాద్	మోమిన్‌పేట్	8.5
రంగారెడ్డి	మంగల్‌పల్లి	9.0
మేడ్చల్	కొండాపూర్	10.8



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్‌ప్రతీక్‌జైన్, ఎస్పీ అధికారులు

సీఎం పర్యటన.. స్థల పరిశీలన

కొడంగల్/దుద్యాల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 24న సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్ పర్యటన నేపథ్యంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి పలువురు అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. గురువారం మొదట కొడంగల్ పట్టణ శివారులోని ఎన్కేపల్లి గేటు వద్ద అక్షయ పాత్ర కిచెన్ షెడ్ భూమి పూజ కోసం స్థలాన్ని పరిశీలించారు. అనంతరం దుద్యాల మండలంలోని హకీంపేట్‌కు వెళ్లిన వారు కలెక్టర్.. ఎడ్యుకేషన్ హబ్ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీరింగ్ విజయభాస్కర్‌రెడ్డితో కలిసి ఎడ్యుకేషన్ హబ్‌కు కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. ఈ స్థలంలో సైనిక్ స్కూల్, ఇతర ముఖ్యమైన వాటికి సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం అధికారులు పోలేపల్లి ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, డీఎస్పీ శ్రీనివాస్, సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్సై శ్రీశైలం, ఆర్ఐ నవీన్‌కుమార్, ఇంజనీర్లు శ్రీనివాస్, రాజయ్య, ఏఈ జనార్ధన్‌మూర్తి, టీజీఐఐసీ, ఆర్అండ్‌బీ అధికారులు, అక్షయ పాత్ర ఫౌండేషన్ చైతన్య, శరత్ ఆలయ ఈవో రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలి

» జిల్లా పంచాయతీ అధికారి జయసుధ



మాట్లాడుతున్న డీపీవో జయసుధ

వికారాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాధ్యతగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి డాక్టర్ జయసుధ పేర్కొన్నారు. గురువారం వికారాబాద్ పట్టణంలోని కొత్తగడి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రపంచ బాలల దినోత్సవం సందర్భంగా 'పిల్లల కోసం ఒక రోజు' అనే థీమ్‌తో బాలల సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ బాలల హక్కులను ఐక్య రాజ్య సమితి 1989లో ఆమోదించిందనే విషయాన్ని విద్యార్థులకు వివరించారు. బాలల హక్కులు, విద్యాహక్కు తదితర కీలక అంశాలను విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వినయ్ కుమార్, ఎంపీవో దయానంద్, పంచాయతీ కార్యదర్శులు ప్రవిత, పూర్ణిమ, స్వాతి, శిల్ప, పుష్పమ్మ, శ్రీజ, స్వాతి రుక్మిణి పాల్గొన్నారు.



పక్కాగా జలవనరుల లెక్క!

జిల్లాలో చెరువులు, కుంటలు, బోరుబావుల సర్వే

- క్షేత్ర స్థాయిలో లెక్కించనున్న ఎన్యుమరేటర్లు
- నెల రోజుల పాటు కొనసాగనున్న ప్రక్రియ
- రేపటి నుంచి మూడు రోజుల పాటు శిక్షణా తరగతులు
- వచ్చే వారంలో జల గణన ప్రారంభానికి సన్నాహాలు

పెరుగుతున్న గృహ అవసరాలు, సాగు, పరిశ్రమలతో పాటు జనాభాకు అవసరమైన నీటిని అంచనా వేసేందుకు కేంద్ర జలశక్తి శాఖ ఆధ్వర్యంలో ప్రతీ ఐదేళ్లకోసారి జల గణన నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో చిన్న నీటి వనరుల లెక్క తేల్చేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. భూగర్భంలోకి ఇంకిపోయే జలాలతో పాటు ఇతర అవసరాలకు ఎంత నీరు వినియోగించుకునే అవకాశం ఉంటుందనే వివరాలు ఈ సర్వే ద్వారా తేలనుంది. డిసెంబరు నెలాఖరులోగా జిల్లాలో జల గణన పూర్తి చేయాలనే లక్ష్యం ప్రభుత్వం నిర్దేశించింది.

వికారాబాద్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కేంద్ర ప్రభుత్వ పరిధిలోని జలశక్తి శాఖ నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా చిన్ననీటి వనరులను జల వనరుల లెక్కింపు చేపడుతోంది. ఇంతకు ముందు 2017-18లో జల గణన చేపట్టారు. జిల్లాలో చిన్ననీటి వనరులను లెక్కించేందుకు ప్రభుత్వం ఇప్పటికే షెడ్యూల్ ఖరారు చేసింది. మ్యానువల్ పద్ధతిలో నీటి వనరులను లెక్కించి ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేయనున్నారు. ఈ గణనలో భాగంగా బోరు బావులు, ఓపెన్ బావులు, చెరువులు, నీటి కుంటలు, రెండు వేల హెక్టార్లలోపు విస్తీర్ణానికి సాగు నీరు అందించే జల వనరులనూ లెక్కించనున్నారు. నీటి వనరులను లెక్కించడం ద్వారా ఏయే గ్రామంలో ఎన్ని నీటి వనరులు ఉన్నాయనేది స్పష్టత రానుంది. ఈ నివేదికల ఆధారంగానే కేంద్ర ప్రభుత్వం నీటి వనరుల అభివృద్ధికి వివిధ పథకాల ద్వారా నిధులు కేటాయించనుంది.

జిల్లా వివరాలు	
చిన్ననీటి వనరులు	1,187
కుంటలు	384
చిన్న ప్రాజెక్టులు	08

నీటి వనరుల లెక్కింపుపై శిక్షణ

జిల్లాలో 20 మండలాల పరిధిలో 594 పంచాయతీలు ఉన్నాయి. జల వనరుల గణన కోసం ప్రణాళిక, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు పర్యవేక్షించే విధంగా కార్యాచరణ సిద్ధం చేశారు. కలెక్టర్ చైర్మన్‌గా, సీపీవో కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. మండలాల్లో జరిగే చిన్ననీటి వనరుల లెక్కింపు ప్రక్రియను తహసీల్దార్లు ఛార్జ్ అధికారులుగా, మునిసిపాలిటీల పరిధిలో కమిషనర్లు మునిసిపల్ సెన్సెస్ అధికారులుగా పర్యవేక్షించనున్నారు. జిల్లా స్థాయిలో సంబంధిత అధికారులతో

మిగతా 8వ పేజీలో...



అన్నాభిషేకం నిర్వహిస్తున్న నిర్వాహకులు

ముగిసిన కార్తీక మాసోత్సవం

కీసర, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): నెల రోజులుగా కీసరగుట్టలో జరుగుతున్న కార్తీక మాసోత్సవం అన్నాభిషేకంతో ముగిసింది. ఈ మేరకు గురువారం అమావాస్య సందర్భంగా మూలవిరాట్‌కు మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తుల ఆర్జిత సేవలకు అనుమతించారు. మధ్యాహ్నం ఆలయ చైర్మన్ తటాకం నారాయణ శర్మ ఆధ్వర్యంలో వరి అన్నంతో స్వామివారికి అన్నాభిషేకం నిర్వహించారు. కాగా, కీసరగుట్టలో పూజ సామాగ్రి అధిక ధరలకు విక్రయించిన వారిపై చట్టరీత్య చర్యలు తీసుకుంటామని ఆలయ చైర్మన్ నారాయణశర్మ తెలిపారు. కీసరగుట్టలో భక్తుల నిలువుదోపిడీ అంటూ సోషల్ మీడియాలో వస్తున్న వార్తలను ఆయన ఖండించారు. దీనిపై విచారణ జరిపి టెండర్ ధర కంటే అధిక రేట్లకు సామగ్రి విక్రయించినట్లయితే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

బీజాపూర్ హైవేపై తప్పిన పెను ప్రమాదం
అదుపుతప్పి చెట్టును ఢీకొట్టిన టిప్పర్
7
తొమ్మిది నెలల్లో రోడ్డు పనులు పూర్తి
ప్రెస్‌మీట్‌లో చేవెళ్ల, తాండూరు, పరిగి ఎమ్మెల్యేలు

టీ డయాగ్నొస్టిక్ హబ్‌కు జబ్బు

తరచూ మొరాయిస్తున్న బయోకెమిస్ట్రీ మిషన్

ఐదు రోజులుగా రోగులకు అందని సేవలు.. ప్రైవేట్ సెంటర్లను ఆశ్రయిస్తున్న గర్భిణులు

ఇబ్బందులు పడుతున్న డయాలసిస్ బాధితులు.. ప్రత్యామ్నాయ మిషన్లు లేక తప్పని తిప్పలు



బయోకెమిస్ట్రీ మిషన్‌కు మరమ్మతులు చేస్తున్న టెక్నీషియన్

వికారాబాద్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉచితంగా రోగులకు జబ్బు నిర్ధారణ, రక్త పరీక్షలు చేసేందుకు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన తెలంగాణ డయాగ్నొస్టిక్ హబ్‌కు జబ్బు చేసింది. తరచూ ఇక్కడ మిషన్లు పాడవుతుండటంతో రోగులకు తిప్పలు తప్పడం లేదు. బయోకెమిస్ట్రీ మిషన్ తరుచుగా పాడవుతుండడం దానికి ప్రత్యామ్నాయ మిషన్లు లేక పోవడంతో వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి పేద రోగులు, గర్భిణులు ప్రైవేట్‌ను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా చికిత్స అందుతుందని వస్తే రక్త పరీక్షలకు బయటకు పంపిస్తున్నారని అక్కడ పరీక్షలకు రూ.1,500 నుంచి రూ.3 వేల వరకు ఖర్చు అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

50 ఆసుపత్రులకు ఒకటే..

జిల్లా కేంద్రంలోని తెలంగాణ డయాగ్నొస్టిక్ హబ్ వికారాబాద్ జిల్లాతో పాటు రంగారెడ్డి జిల్లాలోని మొత్తం 50 ఆసుపత్రులకు వచ్చే రోగులకు సేవలు అందిస్తుంది. అన్ని ప్రాంతాల నుంచి ఇక్కడకు రక్త నమూనాలను

మిగతా 8వ పేజీలో...

త్వరలో అందుబాటులోకి..

బయోకెమిస్ట్రీ మిషన్ గత ఐదు రోజులుగా పనిచేయడం లేదు. ప్రత్యామ్నాయ మిషన్ ఇక్కడ లేకపోవడం వల్ల సమస్య వస్తోంది. ప్రస్తుతం మరమ్మతులు చేయిస్తున్నాం. త్వరగా రోగులకు అందుబాటులోకి తెచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

-సతీశ్ గౌడ్, డయాగ్నొస్టిక్ హబ్ టెక్నీషియన్

అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

» వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్



బహుమతులు అందుకున్న విద్యార్థులతో కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్/పూడూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మేధావిగా గుర్తింపు పొందిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకొని విద్యను అభ్యసించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ విద్యార్థులకు సూచించారు. గురువారం అంతర్జాతీయ బాలల హక్కుల, జాతీయ గ్రంథాలయ దినోత్సవాల సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ చదువుతో పాటు ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా చురుగ్గా పాల్గొనాలని సూచించారు. చదువు ద్వారానే సమాజంలో గుర్తింపు వస్తుందన్నారు. వారి పెద్దల ద్వారానే తాను కూడా గ్రంథాలయాలకు వెళ్లే అలవాటును నేర్చుకున్నానన్నారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విధంగా గ్రంథాలయంలో సౌకర్యాలు కల్పించామన్నారు. ఈ సందర్భంగా బాలల హక్కులపై డీడబ్ల్యూవో కృష్ణవేణి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వ్యాసరచన, రంగోలి, మెహందీ పోటీల విజేతలకు కలెక్టర్ బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సురేశ్‌బాబు, డీపీఆర్ఓ చెన్నమ్మ, గ్రంథాలయ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన పెంచుకోవాలి

విద్యార్థులందరూ తమ హక్కులపై అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. గురువారం పూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన లిస్టినింగ్ టూ చిల్డ్రన్ డే బాల సభను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో నాణ్యమైన ఆహారాన్ని అందించాలని నిర్వహకులను ఆదేశించారు. కలెక్టర్ వెంట మండల విద్యాధికారి సాయిరెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

వికారాబాద్‌లో టెట్ సెంటర్ ఏర్పాటు చేయండి

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



వికారాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) -2026కు వికారాబాద్ జిల్లా నుంచి హాజరయ్యే అభ్యర్థుల సౌకర్యం కోసం జిల్లా కేంద్రంలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని స్పీకర్ ప్రసాద్‌కుమార్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. ఈ మేరకు గురువారం సీఎంతో పాటు విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి లేఖ రాశారు. జిల్లా నుంచి టెట్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల సౌలభ్యం కోసం పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నకిలీ డాక్యుమెంట్ల ముఠా గుట్టురట్టు

పోలీసుల అదుపులో 22 మంది

సుమారు రూ.10కోట్ల మేర లావాదేవీలు



కీసర సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

కీసర రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నకిలీ డాక్యుమెంట్ల ముఠా గుట్టును కీసర పోలీసులు రట్టు చేశారు. వారం రోజులుగా గోప్యంగా జరుగుతున్న విచారణలో భాగంగా పలువురు డాక్యుమెంట్ రైటర్లను పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. డాక్యుమెంట్ రైటర్ల వద్ద పనిచేసేవాళ్లు, డాక్యుమెంట్ రైటర్లు, మరికొంత మంది కలిసి ముఠాగా ఏర్పడి ఈ వ్యవహారం నడిపినట్లు తెలుస్తోంది. మేడ్చల్ జిల్లా నాగారం మున్సిపాలిటీ రాంపల్లి పరిధిలోని లక్ష్మీనగర్, శేషాద్రినగర్, శ్రీదేవినగర్ కాలనీలతో పాటు పలు వెంచర్లలోని ప్లాట్లకు సబ్‌రిజిస్ట్రార్‌ను తప్పుదోవ పట్టించి నకిలీ డాక్యుమెంట్లు సృష్టించినట్లు సమాచారం. ఇందుకు డాక్యుమెంట్ రైటర్లకు అధిక మొత్తంలో ముట్టజెప్పేవారు. ఈ నకిలీ డాక్యుమెంట్లతో ప్లాట్లను విక్రయించడంతో పాటు బ్యాంకుల్లో రుణాలు పొందినట్లు సమాచారం.

సెటిల్‌మెంట్ల పేరుతో..

వెంచర్లలో డాక్యుమెంట్ కాకుండా మిగిలిపోయిన ప్లాట్లు, ప్లాట్ల వద్దకు రాని వారి ప్లాట్లను ఎంచుకుని నకిలీ డాక్యుమెంట్లు తయారు చేసేవారు. ఈ నకిలీ డాక్యుమెంట్ల ఆధారంగా బ్యాంకుల్లో రుణాలను పొందడం, ఫస్ట్ డాక్యుమెంట్ దారుని వద్దకు వెళ్లి మావద్ద సెకండ్ డాక్యుమెంట్ ఉందని, సెటిల్ చేసుకోవాలని చెప్పి డబ్బులు నొక్కేవారు. ఈ విధంగా దాదాపు 20 ప్లాట్లకు సంబంధించి దాదాపు రూ.10 కోట్ల మేర లావాదేవీలు జరిపినట్లు తెలుస్తోంది. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. గోప్యంగా జరిపిన విచారణలో విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. తమది కాని ప్లాట్లకు యజమానిగా మారి నకిలీ డాక్యుమెంట్లతో విక్రయించేవారని తేలింది. ఈ మేరకు పోలీసులు ప్రధాన నిందితులిగా అనుమానిస్తున్న దాదాపు 22 మందిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. దీనిపై సీఐ ఆంజనేయులును వివరణ కోరగా త్వరలో ప్రెస్‌మీట్ ద్వారా పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

ఇక లక్నాపూర్‌లో బోటింగ్..



పరిగి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లక్నాపూర్ ప్రాజెక్టులో పర్యాటకులకు బోటింగ్ చేసే అవకాశం వచ్చేసింది. ప్రాజెక్టును పర్యాటక ప్రాంతంగా మార్చాలని ఏళ్లుగా డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్టును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడంతో బోటింగ్ వసతి కల్పిస్తామని గతంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పలుమార్లు తెలిపిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో గురువారం ఒక బోట్ లక్నాపూర్ ప్రాజెక్టుకు చేరుకుంది. కాగా, నేడు(శుక్రవారం) ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించ నున్నట్లు పర్యాటక శాఖ జిల్లా మేనేజర్ ప్రభుదాస్ తెలిపారు.

పరిశ్రమలో భారీ అగ్ని ప్రమాదం

» రూ.కోటి మేర ఆస్తి నష్టం



దగ్ధమవుతున్న పరుపుల పరిశ్రమ

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఓ పరుపుల ఫోమ్(బెడ్స్ ఫోమ్) తయారీ పరిశ్రమలో ప్రమాదవశాత్తు భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని అవుశాపూర్‌లో గురువారం ఉదయం ముగ్గురు కార్మికులు ఫోమ్ పరిశ్రమలో పనిచేస్తుండగా షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ఫోమ్‌కు మంటలు అంటుకొని ఒక్కసారిగా పరిశ్రమంతా దట్టమైన పొగ వ్యాపించింది. వెంటనే కార్మికులు పరుగులు తీసి స్థానికుల సహాయంతో పోలీసులకు సమాచారం అందించారు. సీఐ ఎం.బాలస్వామి పరిశ్రమ వద్దకు చేరుకొని అగ్నిమాపక అధికారులకు తెలియజేశాడు. ఫైరింజన్లు అక్కడికి చేరుకునే లోపే పెద్దమొత్తంలో పరిశ్రమలో ముడిసరుకు కాలి బూడిదైంది. తర్వాత అగ్రిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. రెండు నెలల క్రితమే ఈ పరిశ్రమను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. పరిశ్రమ పైకప్పు సైతం మంటలకు పూర్తిగా దగ్ధమై పనికి రాకుండాపోయింది. కోట్ల రూపాయల నష్టం వాటిల్లినట్లు నిర్వాహకులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. అక్కడ జిల్లా ఫైర్ ఆఫీసర్ మధుసుదన్‌రావు, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ మధుసుదన్‌రెడ్డి, ఎస్ఐలు అచ్చన శేఖర్, షేక్‌హీనా, పోలీసు సిబ్బంది, తదితరులు ఉన్నారు.



నిరసన తెలుపుతున్న కేవీపీఎస్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

వెంటనే ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి

యాలాల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ధాన్యాన్ని 20 రోజుల నుంచి కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నా కొనుగోళ్లు చేపట్టడం లేదని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుగ్గప్ప ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం యాలాల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులతో కలిసి వారు పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినప్పటికీ కొనుగోళ్లు చేపట్టకపోవడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి స్పందించి రైతుల ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, లేకపోతే పెద్ద ఎత్తున రైతులతో కలిసి ఆందోళన చస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో అశోక్, సాయిలు, నర్సింహులు, శ్యామప్ప తదితరులు పాల్గొన్నారు.

సందడిగా చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న జిల్లా వైద్యాధికారి ఉమాగౌరి

మేడ్చల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఆశా కార్యకర్తలకు గురువారం ఒక్కొక్కరికి రెండు చీరల చొప్పున జిల్లా వైద్యాధికారి ఉమాగౌరి పంపిణీ చేశారు. ప్రతీ సంవత్సరం వారి సంక్షేమం కోసం ప్రభుత్వం అందించే చీరలను ఈ ఏడాది కూడా పంపిణీ చేసినట్లు డీఎంహెచ్‌వో తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు, జిల్లా ప్రాజెక్టు మేనేజరు, జిల్లా పబ్లిక్ హెల్త్ నోడల్ ఆఫీసర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మహిళల రక్షణలో ప్రభుత్వాలు విఫలం



చేవెళ్లలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు

చేవెళ్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మహిళలకు రక్షణ కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయని ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యురాలు మమత అన్నారు. గురువారం చేవెళ్లలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. షిటీమ్స్ ఎక్కడ కూడా సరిగా పని చేయడం లేదన్నారు. మహిళలపై రోజురోజుకూ హత్యాచారాలు పెరిగిపోతున్నా ప్రభుత్వాలు స్పందించడం లేదన్నారు. దేశవ్యాప్తంగా బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మహిళలపై అధికంగా హత్యాచార ఘటనలు జరిగాయని ఆరోపించారు. కళాశాలల్లో మహిళలపై ర్యాగింగ్ ఘటనలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కేంద్రం నూతన విద్యావిధానంతో కాషాయీకరణ చేసే కుట్ర చేస్తోందన్నారు. నాయకులు ప్రణయ్, శంకర్, శ్రీకాంత్, తరంగ్, అరుణ్‌కుమార్, వంశి, సింధు, యశ్వంత్, పవన్‌కుమార్, విష్ణు, నవీన్, విష్ణుగుప్త, చరణ్‌గౌడ్ ఉన్నారు.



సంతకాల సేకరణ కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): టీపీసీసీ ఓట్ చోర్ - గద్దీ చోడ్ సంతకాల సేకరణ రాష్ట్ర కమిటీ చైర్మన్‌గా పరిగి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షినటరాజన్ టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. చైర్మన్‌గా రామ్మోహన్‌రెడ్డి, సభ్యులుగా వీర్లపల్లి శంకర్, కె.శంకర్‌నాయక్, మేడిపల్లి సత్యం, కె.పుష్పలీల, బిక్షైలేష్ కుమార్, అల్లం భాస్కర్‌ను నియమించారు.

ప్రజల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే..

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ



ఘట్‌కేసర్‌లో జరిగిన కార్యక్రమంలో సీపీఐ నాయకులు

ఘట్‌కేసర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పేదల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులేనని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్యపద్మ అన్నారు. సీపీఐ శత వసంతాల ప్రచార బస్సు జాత గురువారం ఘట్‌కేసర్‌కు చేరుకున్నది. ఈ జాతకు ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల నుంచి పార్టీ నేతలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఘట్‌కేసర్ బస్‌స్టాండ్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలలో ఆమె మాట్లాడుతూ వంద సంవత్సరాల చరిత్రలో పార్టీ నాయకత్వం, కార్యకర్తలు అనేక త్యాగాలు చేశారన్నారు. చదువు పూర్తి చేసిన వెంటనే ఉద్యోగాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు వీఎస్ బోస్, వలిఉల్లా ఖాద్రి, ఉప్పలయ్య, నరేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే మౌలిక వసతుల కల్పన



మాట్లాడుతున్న కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేశ్‌యాదవ్

శామీర్‌పేట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంతోనే ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, అభివృద్ధి పనులు చేపడుతున్నామని కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేశ్‌యాదవ్ అన్నారు. తూంకుంట మున్సిపల్‌లో మొత్తం రూ.87 లక్షల మున్సిపల్ నిధులతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మున్సిపల్ నాలుగో వార్డులో రూ.21 లక్షలతో సీసీ రోడ్డుకు, 6వ వార్డులో రూ.14 లక్షలతో సీసీ రోడ్డుకు, 7వ వార్డులో రూ.27 లక్షలతో సీసీ రోడ్డుకు రూ.16 లక్షలతో అదనంగా మరో నూతన సీసీ రోడ్డుకు, రూ.9.5 లక్షలతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఏ సభ్యుడు జైపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నిర్మలయాదవ్, ఏబ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, కట్ట మైసమ్మ దేవాలయ చైర్మన్ మహేందర్‌యాదవ్, నాయకులు మధుసూదన్‌రెడ్డి, ఎద్దు నాగేశ్, జైపాల్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, దోసకాయల వెంకటేశ్, తుంకి రమేశ్, తుంకి భిక్షపతి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

చిన్న పిల్లల వైద్య శిబిరానికి స్పందన



పిల్లలను పరీక్షిస్తున్న చీఫ్ పీడియాట్రిక్ డాక్టర్ నాగేశ్వరరావు

శంషాబాద్, నవంబర్ 20(ఆంధ్రజ్యోతి): చిన్న పిల్లలకు గుండె సంబంధిత సమస్యలపై నిర్వహించిన వైద్య శిబిరానికి స్పందన లభించింది. చిన్న పిల్లల్లో గుండె జబ్బులు గుర్తించి ఉచితంగా వైద్యం చేసేందుకు శంషాబాద్‌లో గురువారం అమృత ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ సంతోష్ సహకారంతో రెయిన్‌బో కార్డియాలజీ ఇనిస్టిట్యూల్ సహకారంతో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఇనిస్టిట్యూల్ డీఎం డాక్టర్ నాగేశ్వరరావు కోనేరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న పిల్లల్లో గుండె సంబంధిత వ్యాధులను గుర్తించడానికి వైద్య శిబిరం నిర్వహించిన డాక్టర్ సంతోష్‌తోపాటు ఆసుపత్రి సిబ్బందిని ప్రశంసించారు.



అవార్డు అందుకుంటున్న మొగులయ్య

మొగులయ్యకు ఉత్తమ సొసైటీ చైర్మన్ అవార్డు

కులకచర్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రంగారెడ్డి జిల్లా స్థాయి ఉత్తమ సొసైటీ చైర్మన్ అవార్డును డీసీసీబీ డైరెక్టర్, కులకచర్ల సొసైటీ చైర్మన్ కనకం మొగులయ్య అందుకున్నారు. 72వ అఖిల భారత సహకార వారోత్సవాలు హైదరాబాద్‌లోని గన్‌ఫౌండ్రీలో గురువారం జరిగాయి. ఈ సందర్భంగా తెలంగాణ సహకార యూనియన్ ఆధ్వర్యంలో ఉమ్మడి నల్గొండ డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి మొగులయ్యకు అవార్డు ప్రదానం చేశారు. సొసైటీ ద్వారా ఇచ్చిన అప్పులు రికవరీ చేయడం, కొత్త అప్పులు ఇవ్వడంలో సొసైటీ అగ్రస్థానంలో ఉందని తెలిపారు. రైతులకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించినందుకు ఈ అవార్డు దక్కిందని మొగులయ్య తెలిపారు. డీసీవోలు, కులకచర్ల సొసైటీ డైరెక్టర్ కొండయ్యగౌడ్ పాల్గొన్నారు.

ఐరాసాలో బాలల హక్కులకు గుర్తింపు



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవా చీఫ్ లీగల్ అడ్వకేట్ వెంకటేశ్

ధారూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఐక్య రాజ్య సమితి(ఐరాస)లో బాలల హక్కులకు గుర్తింపు లభించిందని జిల్లా న్యాయ సేవా చీఫ్ లీగల్ అడ్వకేట్ వెంకటేశ్ అన్నారు. మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహంలో గురువారం సాధన స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ బాలల హక్కుల దినోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరై మాట్లాడారు. మానవ హక్కుల్లో భాగంగా బాలల హక్కులను పొందుపరిచినట్లు తెలిపారు. బాలలకు జీవించే, రక్షణ, అభివృద్ధి చెందే హక్కులను ఐక్యరాజ్య సమితి పొందుపరిచినట్లు చెప్పారు. బాల్య వివాహాలు, బాల కార్మికుల వ్యవస్థ నిర్మూలన, లైంగిక వేధింపులు జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో షీ టీం ఇన్‌చార్జి బుచ్చేందర్ రెడ్డి, పీహెచ్‌సీ సూపర్‌వైజర్ విజేందర్, భరోసా ఇన్‌చార్జి రాజశ్రీ, మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం ఇన్‌చార్జి అలీమొద్దీన్, సాధన సంస్థ కో ఆర్డినేటర్లు బీ.నర్సింహులు, శ్వేత, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి స్వర్ణకుమారి

వికారాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మాతాశిశు సంరక్షణకు అందిస్తున్న సేవలను తప్పని సరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి స్వర్ణకుమారి పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ప్రోగ్రామ్ అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శస్త్ర చికిత్సలను తగ్గించేందుకు సాధారణ ప్రసవాల ప్రోత్సాహంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సిజేరియన్లు అధికంగా జరుగుతున్న ఆసుపత్రుల్లో ఆడిట్ నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా ఆసుపత్రిలో 23 పడకల జిరియాట్రిక్ వార్డు ఏర్పాటు చేసి వృద్ధులకు ప్రత్యేక చికిత్సలు అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ నెల 21 నుండి డిసెంబర్ 4 వరకు జరుగుతున్న వేసెక్టమీ పక్షోత్సవాలలో ప్రతీ పీహెచ్‌సీ నుంచి కనీసం ఒక్క శస్త్ర చికిత్స చేయాలని సూచించారు. సమీక్షలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ రవీంద్ర యాదవ్, ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ పవిత్ర, డాక్టర్ బుచ్చిబాబు, డాక్టర్ నిరోషా, డాక్టర్ గోపాల్, డిప్యూటీ డెమో శ్రీనివాసులు, పీహెచ్‌సీల వైద్యాధికారులు పాల్గొన్నారు.

చెన్‌గోముల్ పీహెచ్‌సీ తనిఖీ

పూడూరు: మండల పరిధిలోని చెన్‌గోముల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీహెచ్ఎంవో స్వర్ణకుమారి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో పలు రికార్డులను పరిశీలించి వైద్యులు, సిబ్బందితో మాట్లాడారు. అనంతరం ఆసుపత్రికి వచ్చిన రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్యులు సమయపాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలందించాలని ఆదేశించారు. డీహెచ్ఎంవో వెంట వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు సరిత

మేడ్చల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : చిన్నారులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు సరిత సూచించారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్‌లో అంతర్జాతీయ బాలల హక్కుల వారోత్సవాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సరిత మాట్లాడుతూ చిన్నారులు విద్య, రక్షణ, గౌరవం పొందడం, ప్రాథమిక హక్కున్నారు. అదనపు కలెక్టర్ రాధికాగుప్తా మాట్లాడుతూ ప్రతీ చిన్నారి ఆత్మవిశ్వాసం ఆనందంతో ఎదగాలన్నారు. ఈ సందర్భంగా బాలల హక్కులు రక్షిద్దామని కోరారు. సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ రాజారెడ్డి మాట్లాడుతూ పిల్లలు విద్యను పొందే హక్కు కలిగి ఉన్నారన్నారు. జిల్లా సంక్షేమ అధికారి శారద మాట్లాడుతూ బాలల హక్కులకు ఆటంకం కలిగితే 1098 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. బాలలు మంచి పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యవంతంగా ఉండాలని, విద్యతోనే ఏదైనా సాధించగలమన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉండాలి

మొయినాబాద్ రూరల్, నవంబరు20(ఆంధ్రజ్యోతి): ఆర్థిక పరిస్థితుల కారణంగా అనేక మంది పేదలు ఉన్నత వైద్యానికి నోచుకోవడం లేదని, అలాంటి వారికి అండగా ఉండాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు సీఎస్ రంగరాజన్ అన్నారు. గురువారం ఆలయం వద్ద ఉండే ఓ పేద కుటుంబానికి చెందిన దివ్యాంగురాలైన యువతికి చూడు చక్రాల కుర్చీ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చిలుకూరు బాలాజీ ఆలయం ఆధ్వర్యంలో పేదలకు ఉచితంగా వైద్య సాయం చేస్తున్నట్లు తెలిపారు. ఉచితంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట పవన్‌కుమార్, ఆలయ సిబ్బంది ఉన్నారు.

మరకత శివలింగాన్ని దర్శించుకున్న రామజోగయ్య శాస్త్రి



శాస్త్రి దంపతులకు స్వామి వారి చిత్రపటాన్ని అందిస్తున్న కమిటీ సభ్యులు

శంకర్‌పల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చందిప్ప గ్రామంలోని మరకత శివలింగాన్ని గురువారం సినీ గేయ రచయిత రామజోగయ్య శాస్త్రి దంపతులు దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11వ శతాబ్దానికి చెందిన మహిమగల బ్రహ్మసూత్ర మరకత శివాలయాన్ని దర్శించుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్‌రెడ్డి, ప్రచార కమిటీ చైర్మన్ దయాకర్‌స్వామి, వైస్ చైర్మన్ శేఖర్ వారికి స్వామివారి చిత్రపటాన్ని అందించారు.

ఉప్పర్‌పల్లి అంగన్‌వాడీ పనితీరు భేష్



మహిళలతో మాట్లాడుతున్న అధికారులు

శామీర్‌పేట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉప్పర్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రం పనితీరు భేష్ అని కేంద్ర ప్రభుత్వ డబ్ల్యూడీ, సీడబ్ల్యూ డైరెక్టర్ దయాశంకర్, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి జానకీ విశ్వనాథన్ కితాబిచ్చారు. గురువారం తూంకుంట మున్సిపల్ పరిధిలోని ఉప్పర్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఆట, పాటలతో సందడి చేస్తున్న చిన్నారులను చూసి హర్షం వ్యక్తం చేశారు. అర్లీ చైల్డ్ హుడ్ ఎడ్యుకేషన్(ఈసీఈ) అమలు తీరుపై పిల్లల తల్లులను అడిగి తెలుసుకున్నారు. పౌష్టికాహారం పంపిణీ, లబ్ధిదారుల రికార్డులను పరిశీలించారు. అనంతరం అదనపు కలెక్టర్ రాధికాగుప్తా, జిల్లా సంక్షేమాధికారి శారద రాష్ట్ర ప్రభుత్వ అంగన్‌వాడీ కేంద్రాలకు, తల్లులకు, గర్భిణులకు అందజేస్తున్న పౌష్టికాహారం గురించి వివరించారు. కార్యక్రమంలో పార్లమెంటరీ కమిటీ సభ్యులు, కేంద్ర ప్రభుత్వ అధికారులు, అంగన్‌వాడీ టీచర్ శ్రీలత, సూపర్‌వైజర్ నాగమణి ఉన్నారు.

బీజాపూర్ హైవేపై తప్పిన పెను ప్రమాదం

అదుపుతప్పి చెట్టును ఢీకొట్టిన టిప్పర్

ప్రాణాలతో బయటపడ్డ డ్రైవర్

మీర్జాగూడ ఘటనకు 500 మీటర్ల దూరంలో ప్రమాదం



డ్రైవర్ శ్రీరామ్



చేవెళ్ల మండలం ఖానాపూర్ గేట్ వద్ద చెట్టును ఢీకొన్న లారీ

చేవెళ్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ - బీజాపూర్ హైవేపై ఘోర ప్రమాదం తప్పింది. అతివేగంగా వస్తున్న టిప్పర్ అదుపుతప్పి రోడ్డు పక్కన చెట్టును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ఘటన గురువారం ఉదయం చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. బీజాపూర్ హైవే విస్తరణ పనుల్లో భాగంగా చేవెళ్ల మండలంలోని అంతారం గ్రామం నుంచి టిప్పర్‌లో మట్టిని నింపుకొని డ్రైవర్ వడ్డె శ్రీరామ్(28) వస్తున్నాడు. ఖానాపూర్ స్టేజి వద్దకు రాగానే అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు ఢీకొట్టాడు. ఈ ఘటనలో టిప్పర్ ముందు భాగం నుజ్జునుజ్జు కాగా డ్రైవర్ శ్రీరామ్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని టిప్పర్‌ను అక్కడి నుంచి తరలించారు. అయితే ఇటీవల ఇదే రోడ్డుపై మీర్జాగూడ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగి 19 మంది మృతి చెందగా.. మరో 34 మంది గాయాలపాలైన ఘటనా స్థలానికి అర కిలోమీటర్ దూరంలోనే ఈ ఘటన చోటు చేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది.

ముమ్మరంగా రోడ్డు విస్తరణ పనులు

బీజాపూర్ హైవేలో అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు 46 కిలో మీటర్ల వరకు రోడ్డు విస్తరణ పనులు చురుకుగా సాగుతున్నాయి. మీర్జాగూడ ప్రమాదం తర్వాత రోడ్డు విస్తరణ పనులు మేఘా కృష్ణారెడ్డి(కాంట్రాక్టర్) పనులను వేగవంతం చేశారు. జేసీబీలు, పెద్ద పెద్ద యంత్రాలతో రోడ్డుకిరువైపులా చదును చేసే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. దాదాపుగా 20 వాహనాలతో పనులు జరుగుతున్నాయి.

తొమ్మిది నెలల్లో పనులు పూర్తి

- ప్రెస్‌మీట్‌లో చేవెళ్ల, తాండూరు, పరిగి ఎమ్మెల్యేలు

బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులను వేగవంతం చేసి తొమ్మిది నెలల్లో పూర్తి చేస్తామని చేవెళ్ల, తాండూరు, పరిగి ఎమ్మెల్యేలు యాదయ్య, మనోహర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి అన్నారు. గురువారం చేవెళ్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఈ హైవే పనులు గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ముందుకు సాగలేదన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి రోడ్డు విస్తరణ పనులపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారని చెప్పారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు వేసిన ఎన్‌జీవోలతో మాట్లాడి కేసును విరమింపజేశామన్నారు. దీంతో అక్టోబరు 31న ట్రిబ్యునల్ రోడ్డు పనులు చేపట్టాలని తీర్పు ఇచ్చిందని తెలిపారు. ఈ రోడ్డు విస్తరణకు నోచుకోకపోవడంతో ఎంతో మంది ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రోడ్డు విస్తరణలో భాగంగా చిలుకూరు జంక్షన్, భాస్కర్ మెడికల్ కాలేజీ వద్ద, సురంగల్ రోడ్డు, మొయినాబాద్, కనకమామిడి, కేతిరెడ్డిపల్లి, తోల్కట్ట, ముడిమ్యాల్, పలుగుట్ట, చేవెళ్ల, మీర్జాగూడ, దామరిగిద్ద, చిట్టంపల్లి, మీర్జాపూర్ తదితర చోట్ల అండర్‌పాస్‌లు వస్తాయన్నారు. 60 మీటర్ల వెడల్పుతో 24 గంటల పాటు పనులు కొనసాగుతున్నాయన్నారు. ఇంటిగ్రేటెడ్ పాఠశాల భవనానికి త్వరలోనే తోల్కట్ట గ్రామంలో భూమి పూజ చేస్తామని, ఆర్టీసీ బస్ డిపో నిర్మాణ పనులు సైతం ప్రారంభిస్తామన్నారు. సమావేశంలో రాష్ట్ర పొల్యూషన్ బోర్డు సభ్యుడు సత్యనారాయణరెడ్డి, నాయకులు జనార్దన్‌రెడ్డి, మైపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు యాదయ్య, మనోహర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి

ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో

అక్రమాలు వాస్తవమే

- జిల్లా హౌసింగ్ డీఈ సురేశ్
- ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తాం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కొందుర్గు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో అక్రమాలు జరిగిన విషయం వాస్తవమేనని జిల్లా హౌసింగ్ డీఈ సురేశ్ వెల్లడించారు. ఈ మేరకు గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'ఇందిరమ్మ.. ఇదేందమ్మ!' కథనానికి ఆయన స్పందించారు. కొందుర్గు మండలాన్ని సందర్శించి సంబంధిత అధికారులు, గ్రామ కార్యదర్శులను విచారించి... అక్రమంగా నిర్మించిన ఇండ్లను పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో లక్ష్మి అనురాధతో కలిసి అక్రమ నిర్మాణాల గురించి ఆరా తీశారు. ఇందులో చెరుకుపల్లి గ్రామానికి సంబంధించి మల్లని పావని పేరుతో మంజూరైన ఇంటిని పవన్‌కుమార్ పేరిట ఎందుకు మార్చాల్సివచ్చిందంటూ ఎంపీడీవో కార్యాలయ సిబ్బందితో పాటు, గ్రామ కార్యదర్శి అశోక్‌ను నిలదీశారు. దీనికి ఎంపీడీవో స్పందించి ఇందిరమ్మ ఇంటి ఆన్‌లైన్‌లో ఎందుకు ఎడిట్ చేశావని, అందరి ముందు సమాధానం చెప్పాలంటూ చెరుకుపల్లి గ్రామ కార్యదర్శి అశోక్‌పై మండిపడ్డారు. దీనికి అశోక్ స్పందిస్తూ ఇందిరమ్మ కమిటీ సూచనల మేరకు రెండు పేర్లు ఒకేరకంగా ఉండటంతో ఒక్క పేరును ఎడిట్ చేశానని కార్యదర్శి తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అక్రమ నిర్మాణానికి సంబంధించి బ్యాంకు ఖాతాలో జమ చేసిన రూ.లక్షను స్వాధీనం చేసుకోవడంతో పాటు, ప్రస్తుతం నిర్మిస్తున్న ఇంటికి డబ్బులు మంజూరు చేయబోమని తెలిపారు. ఈ అక్రమాలకు సంబంధించిన నివేదికను ఉన్నత స్థాయి అధికారులకు అందజేస్తామన్నారు.

మక్కల కొనుగోలుకు ఓకే..

- ఆన్‌లైన్‌లో నమోదుకు రైతులకు వెసులుబాటు



తాండూరులో కొనుగోలు చేసిన మక్కలను గోదాంకు లారీలో తరలిస్తున్న దృశ్యం

తాండూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి మక్కల కొనుగోలుకు వ్యవసాయ శాఖ ఆన్‌లైన్‌లో వెసులుబాటు కల్పించింది. 'మక్కలకు ఆన్‌లైన్ తిప్పలు' శీర్షికతో ఈ నెల 11న ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. వ్యవసాయాధికారులు ఫీల్డ్‌లోకి వెళ్లి మక్కల రైతులను గుర్తించకుండా కార్యాలయం వద్ద కూర్చొని పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో అసలైన రైతుల పేర్లు లేక మక్కల కొనుగోలుకు అవకాశం లేకుండా పోయింది. కొంత మంది రైతుల పేర్లు నమోదైనా ఆన్‌లైన్‌లో అప్‌డేట్ కాకపోవడంతో మక్కలు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వ రంగ సంస్థలు నిరాకరించాయి. ఆన్‌లైన్‌లో నమోదైన రైతుల నుంచి మాత్రమే మక్కలు కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిబంధనలు విధించడంతో రైతులు నిరాశ చెందారు. ఈ మేరకు ప్రభుత్వం స్పందించి ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు కాని రైతులు రెండు రోజులపాటు పేర్లు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ఎకరాకు 25 క్వింటాళ్లు మించకుండా మక్కలను రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. తాండూరులో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ఆన్‌లైన్‌లో నమోదైన 28 మంది రైతుల నుంచి 1,400 క్వింటాళ్ల మక్కలను కొనుగోలు చేశారు. వాటిని మార్క్‌ఫెడ్ లీజ్‌కు తీసుకున్న గోదాంకు తరలించారు.

విద్యుత్ అంతరాయం..

నిలిచిన డయాలసిస్ సేవలు

వికారాబాద్ ఆస్పత్రిలో ఇబ్బందులు పడ్డ రోగులు

వికారాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని డయాలసిస్ కేంద్రంలో విద్యుత్ అంతరాయం ఏర్పడడంతో డయాలసిస్ సేవలు నిలిచిపోయాయి. గత ప్రభుత్వంలో వికారాబాద్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రంలో గతంలో విద్యుత్ సరఫరా నిలిచిపోతే జనరేటర్ లేక అవస్థలు పడగా పత్రికల్లో వచ్చిన కథనాలకు అధికారులు స్పందించి జనరేటర్ ఏర్పాటు చేయడంతో డయాలసిస్ సేవలు కొంత కాలంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనసాగాయి. అయితే గురువారం ఉదయం త్రీఫేజ్ విద్యుత్ సరఫరాలో లోడ్ కారణంగా డయాలసిస్ కేంద్రంలోని విద్యుత్ బోర్డుల్లో సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో ఉదయం 5 గంటల నుంచి ఏం తినకుండా వచ్చిన రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సుమారు 4 గంటలు పాటు చికిత్స అందుకోక ఏం తినక అవస్థలు పడ్డారు. విద్యుత్ సమస్య పరిష్కారమైన తరువాత రోగులకు సేవలు అందించారు.

వెల్లివిరిసిన మత సామరస్యం



అయ్యప్ప స్వాములకు అన్నదానం చేస్తున్న మహ్మద్ అలీ

మొయినాబాద్ రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కులమతాలకు అతీతంగా ఓ వ్యక్తి అయ్యప్ప స్వాములకు అన్నప్రసాద వితరణ చేసి మతసామరస్యాన్ని చాటుకున్నాడు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్‌నగర్ వార్డులో గ్రామానికి చెందిన దాదాపు 50 మందికి పైగా అయ్యప్ప మాలధరణ చేశారు. వీరికి అదే గ్రామానికి చెందిన మహ్మద్ అలీ గురువారం ఉదయం అన్నప్రసాద వితరణ చేసి తనలో ఉన్న భక్తిని చాటుకున్నాడు. స్వయంగా ఆయనే వడ్డించి స్వాముల పక్కన కూర్చొని భోజనం చేశారు. ప్రతి ఏడాదిలాగే ఈసారి కూడా స్వాములను అన్నప్రసాద వితరణ చేసి మతసామరస్యాన్ని చాటుకున్నాడు. సన్నిదానం గురు స్వామి మురళి, గురు స్వాములు మహేందర్ యాదవ్, రాఘవేందర్, శ్రీశైలం, కుమార్, వెంకటేష్‌గౌడ్, సదానందం గౌడ్, శాంతియువజన సంఘం అధ్యక్షుడు కుమ్మరి విఠల్, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కట్టమిత్తి శ్రీను పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మోహన్ రెడ్డి



మేడ్చల్ టౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ - మల్కాజ్గిరి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శిగా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీకి చెందిన అమరం మోహన్ రెడ్డిని నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం పార్టీ అధిష్ఠానం ఆయనకు నియామక పత్రాన్ని అందజేసింది. ప్రస్తుతం నియోజకవర్గ కన్వీనర్‌గా వ్యవహరిస్తున్న ఆయనకు జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించడంపై నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్టానానికి మోహన్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

మేడ్చల్ రూరల్ జిల్లా కార్యదర్శిగా హనుమాన్



ఘట్‌కేసర్: మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా బీజేపీ రూరల్ జిల్లా కార్యాదర్శిగా విప్పర్ల హనుమాన్ నియమితులయ్యారు. పార్టీలో వివిధ స్థాయిల్లో క్రియాశీలకంగా పనిచేస్తూ పార్టీ అభివృద్ధికి చేస్తున్న కృషికి గాను హనుమాన్‌కు జిల్లా కమిటీలో స్థానం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఇచ్చిన బాధ్యతలను శక్తి వంచన శ్రమిస్తానన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బుద్ది శ్రీనివాస్, రాష్ట్ర నాయకుడు పట్లోళ్ల విక్రంరెడ్డి, రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

పరారీలో జువెల్లరీ యజమాని..

ఆందోళనలో బాధితులు

కులకచర్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఐదు రోజులుగా కులకచర్లలోని అజయ్ జువెల్లర్స్ షాపు యజమాని నరేందర్ చౌదరి ఆచూకీ లభించకపోవడంతో అటు రాజస్థాన్‌లో ఉన్న కుటుంబ సభ్యులు, ఇటు కులకచర్లలో బాధితులు ఆందోళన చెందుతున్నారు. ఈ నెల 16న ఉదయం షాపు తెరిచి వస్తువులు బ్యాగులో పెట్టాడని ఇంటి యజమాని రాజేశ్ తెలిపాడు. తాను తిరుపతికి వెళ్తున్నానని, రెండు రోజుల్లో వస్తానని చెప్పాడని పేర్కొన్నాడు. కస్టమర్స్ వచ్చి నరేందర్ చౌదరి పారిపోయాడని చెప్పడంతో తాను కూడా రూ.3 లక్షలు ఇచ్చానని వాపోయాడు. అదే రోజు బంధువుల ఫంక్షన్‌కు వెళ్తున్నాను, తిరిగి వచ్చిన తర్వాత ఇస్తానని చెప్పి 30 గ్రాముల బంగారు గొలుసు తీసుకెళ్లినట్లు బాల్‌రెడ్డి వాపోయాడు. ఇప్పటివరకు 24 మంది బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించినట్లు ఎస్సై రమేశ్‌కుమార్ గురువారం ప్రకటనలో తెలిపారు. బాధితులకు నరేందర్ చౌదరి నుంచి రూ.37 లక్షల నగదు, 36.8 తులాల బంగారం, 40 తులాల వెండి రావాల్సి ఉందని వివరించారు. అతని ఆచూకీ కోసం ప్రత్యేక టీంను ఏర్పాటు చేశామని, బాధితులు పీఎస్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్సై సూచించారు.

కక్ష సాధింపుతోనే ఈ-రేస్ కేసు

మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

వికారాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాజకీయ కక్ష సాధింపు చర్యలో భాగమే ఫార్ములా ఈ - రేస్ కేసు అని మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ పేర్కొన్నారు. ఉన్నట్టుండి ఈ కేసును తెరపైకి తేవడం ద్వారా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఇబ్బంది పెట్టి రాక్షసానందం పొందడానికి రేవంత్‌రెడ్డి సర్కార్ సిద్ధమైందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రాజకీయంగా లబ్ధిపొందాలని రేవంత్ రెడ్డి ఇలాంటి డ్రామాలకు తెరలేపారని మండి పడ్డారు. ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేయడమే రేవంత్‌రెడ్డి లక్ష్యమన్నారు. పూర్తి పారదర్శకతతో నిర్వహించిన ఫార్ములా ఈ రేస్ కేసు ఇన్నాళ్లు నిద్రావస్థలో ఎందుకు ఉండిపోయిందన్నారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీని పెంచిన కేటీఆర్‌పై అక్రమ కేసులు పెట్టి ఎలాగైనా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల ధైర్యాన్ని దెబ్బతీయాలని రేవంత్ సర్కార్ చూస్తుందన్నారు.

'ప్రజా బాట'తో మెరుగైన సేవలు

ఎస్పీడీసీఎల్ చీఫ్ ఇంజినీర్ బాలస్వామి



రక్షణ చర్యలను పరిశీలిస్తున్న అధికారులు

వికారాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ప్రజా బాట కార్యక్రమం చేపట్టామని ఎస్పీడీసీఎల్ చీఫ్ ఇంజినీర్ బాలస్వామి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బసంత్ ఫంక్షన్ హాలులో ఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రజాబాట కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. వచ్చే వేసవిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. దీని కోసం రూ.55 కోట్ల బడ్జెట్ కేటాయించామని తెలిపారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు పెండింగ్‌లో లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రజా బాటలో భాగంగా వారంలో మూడు రోజులు క్షేత్రస్థాయిలో పర్యటించి విద్యుత్ సమస్యలను గుర్తించి పరిష్కరించాలన్నారు. అంతకుముందు వికారాబాద్ పట్టణంలో అధికారులతో కలిసి వివిధ కాలనీల్లో పర్యటించారు. ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు, లైన్స్ నిర్వహణ తీరును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ రవిప్రసాద్, డీఈ టెక్నికల్, డీఈలు సంజీవరావు, భానుప్రసాద్, ఎస్ఏవో శ్రీనివాసనాయక్, ఏవో శ్రీనాథ్, జిల్లా ఏడీఈలు, ఏఈలు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

12 శాతం రిజర్వేషన్లు కల్పించే వరకూ పోరాడుతాం

కడ్తాల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించి అమలు చేసే వరకూ పోరాడుతామని గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం గిరిజనుల రిజర్వేషన్లు వెంటనే అమలు చేసి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. 12 శాతం రిజర్వేషన్ల కల్పన కోసం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద 'మారో నగరా - జాగో బంజారా' కార్యక్రమానికి కడ్తాల మండలం నుంచి హన్మనాయక్ ఆధ్వర్యంలో గిరిజన నాయకులు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. మాజీ మంత్రి రవీంద్రనాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల గిరిజనులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు. రిజర్వేషన్లు, హక్కుల సాధనకు గిరిజనులంతా సంఘటితంగా పోరాడాలని హన్మనాయక్ పిలుపునిచ్చారు. దేశంలోని లంబాడా, బంజారాలను 16 రకాల పేర్లతో పిలువకుండా అందరికీ షెడ్యూల్ తెగల్లో ఎస్టీ బంజారాగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన గిరిజన సంఘాల నేతలు బీచ్యానాయక్, జగన్‌నాయక్, శంకర్‌నాయక్, లక్పతి నాయక్, నరేశ్ నాయక్, సేవ్యానాయక్, హరిచంద్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర గిరిజన సేవా సంఘం అధ్యక్షుడు హన్మనాయక్

అప్పుపేరుతో భూమి రిజిస్ట్రేషన్

దోమ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అప్పు పేరుతో ఓ రైతును నమ్మించి ఆమెపేరుపై ఉన్న భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. డీఎస్పీ శ్రీనివాస్, ఎస్సై వసంత్ జాదవ్ తెలిపిన వివరాల మేరకు.. మోత్కుర్ గ్రామానికి చెందిన డబ్బు బాలమ్మకు గ్రామంలోని సర్వే నెం.34.40లో ఎకరా 8గుంటల భూమి ఉంది. షాద్‌నగర్ మండలంలోని చించోడ్‌కు చెందిన పోమాల మల్లేశ్, చౌదర్‌గూడెం మండలం పెద్ద వెల్కిచర్లకు చెందిన ప్యాట జంగయ్య వ్యక్తులు గ్రామానికి వచ్చి అప్పు ఇస్తామని చెప్పి ఆమెను నమ్మించారు. షాద్‌నగర్‌కు చెందిన జీవాజి నర్సిములు వద్ద నుంచి రూ.80వేలు అప్పుగా ఇప్పించారు. అప్పుకు సంబంధించి అని నమ్మించి సంతకాలు తీసుకున్నారు. ఆమె పేరుపై ఉన్న భూమిని జీవాజి నర్సిములు భార్య నర్సమ్మ పేరుపై 2021జూలై 23న రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అనంతరం అట్టి భూమిని షాద్‌నగర్‌కు చెందిన మరో వ్యక్తి గోపినాథ్‌కు రూ.17లక్షలకు పోమాల మల్లేశ్, ప్యాట జంగయ్య, జీవిజి నర్సిములు విక్రయించారు. గోపినాథ్ అట్టిభూమిని ఆమె చెల్లెలు శ్రీరమణి పేరుపై 2022 నవంబరు 22న రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. రైతుకు అనుమానం రాగా అప్పు డబ్బులు ఇచ్చేందుకు వారి దగ్గరికి వెళ్లింది. వారు నిరాకరించడంతో తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి భూవివరాలు తెలుసుకోగా భూమి ఆమెపేరుపై లేకపోవడంతో కంగుతిన్నది. దీంతో బాధితులు 2025 ఆగస్టు 24న పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు మోసానికి పాల్పడిన ఆరుగురిని గుర్తించి కేసు నమోదు చేశారు. వారిలో ఇద్దరిని గురువారం రిమాండ్‌కు తరలించారు.

ముగిసిన కార్తీకమాసోత్సవాలు


ఘట్‌కేసర్ రూరల్: మల్లికార్జునస్వామి ఆలయంలో అన్నదానం చేస్తున్న భక్తులు

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసోత్సవాలు గురువారంతో ముగిశాయి. కార్తీకమాసం చివరిరోజు కావడంతో శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అవుశాపూర్‌లోని ఉమామహేశ్వరాలయం, అంకుశాపూర్‌లోని శ్రీ భవానిశంకరాలయం, ఎదులాబాద్‌లోని శ్రీ భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి దేవాలయం, ప్రతాప్‌సింగారంలోని శ్రీ చంద్రమౌళీశ్వరాలయం, కొర్రెములలోని శివాలయంలో ఉదయం స్వామివారికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఎదులాబాద్‌లోని శ్రీ భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు కంట్లం గౌరీ శంకర్, చెన్నప్ప, శ్రీశైలం, శివకుమార్, ప్రదీప్, నరేష్, ఓం ప్రకాష్, భక్తులు గాయారు విశ్వనాథం పాల్గొన్నారు.

కొడంగల్: కార్తీక మాసం ముగింపు సందర్భంగా గురువారం కొడంగల్ పట్టణ శివారులోని సిద్దనొంపు ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులు పూజలు నిర్వహించారు. ఆంజనేయస్వామికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివలింగానికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హిందూవాహిని సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.


కులకచర్ల: ముజాహిద్‌పూర్‌లో వీరాంజనేయస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

కులకచర్ల: కార్తీక మాసం చివరి రోజు అమావాస్య సందర్భంగా గురువారం కులకచర్ల మండలంలోని ముజాహిద్‌పూర్ వీరాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు, అఖండ భజనలు, ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో భక్తుల కోలాహలం నెలకొంది. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు, పూజారి విజయ్‌కుమార్, గ్రామస్థులు పాల్గొన్నారు.

తాండూరు: కట్టమైసమ్మ ఆలయంలో కార్తీక మాసం ముగింపు సందర్భంగా మార్కెట్ కమిటీ మాజీచైర్మన్ విఠల్‌నాయక్ అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ నీరజ బాల్‌రెడ్డి, భక్తులు, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

23న సత్యసాయి శతవర్ష జయంతి

వికారాబాద్: పట్టణంలోని ప్రశాంతి నగర్‌లో గల శ్రీ సత్యసాయి జ్ఞాన కేంద్రంలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబా శతవర్ష జయంతి ఉత్సవాలు 23 నవంబరు ఆదివారం అంగరంగ వైభవంగా జరుగనున్నాయని వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ హారతి ద్వారకానాథ్, కన్వీనర్ సత్యనారాయణ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా తెలంగాణ హైకోర్టు న్యాయవాది సాయిప్రసాద్, సుధాకర్ రెడ్డి, గోపాల్ రెడ్డి, కోకట్ మాదవరెడ్డి పాల్గొంటారన్నారు. నగర సంకీర్తన, పతాకావిష్కరణ, అభిషేకం, అర్చన, అష్టోత్తరం, సాయి గాయత్రి, హనుమాన్ చాలీసా, భజన సంకీర్తనలు, 46వ సాయి గాయత్రీ యజ్ఞం ఆధ్యాత్మిక ఉపన్యాసాలు నిర్వహించబడతాయన్నారు. వ్యాసరచన పోటీలు విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారన్నారు. సాయంత్రం జవహర్ బాల కేంద్రం విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఉంటాయని ఇన్‌చార్జి పర్యవేక్షకురాలు టి.అనురాధ తెలిపారు.

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో లారీ డ్రైవర్ మృతి


హకీం మృతదేహం

మేడ్చల్ టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) విద్యుదాఘాతంతో లారీ కంటైనర్ డ్రైవర్ మృతిచెందిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హర్యానాకు చెందిన హకీం(35) గురువారం ఎల్లంపేట సమీపంలోని ఓ గోదాంకు వాహనం తరలిస్తున్న క్రమంలో స్తంభానికి ఆనుకుని ఉన్న విద్యుత్ తీగలు కంటైనర్ లారీకి తగిలాయి. దీంతో వాహనం నడుపుతున్న హకీం విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదుఉ చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

టిప్పర్ల మధ్య ఇరుక్కొని వ్యక్తి..


మృతిచెందిన డ్రైవర్ శ్రీనివాస్‌యాదవ్

దౌల్తాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ గ్రామంలో ఏపీలోని కడప జిల్లా రామాపూరం గ్రామానికి చెందిన శ్రీనివాస్‌యాదవ్(26) రోడ్డు పనుల నిమిత్తం గురువారం మట్టిని టిప్పర్‌లో తరలిస్తున్నాడు. ఈక్రమంలో జేసీబీతో మట్టిని లోడ్ చేసే క్రమంలో టిప్పర్, టిప్పర్‌కి మధ్యలో ఇరుక్కొని అక్కడికక్కడే డ్రైవర్ శ్రీనివాస్‌యాదవ్ మృతిచెందాడు. ఎస్‌ఐ రాజ్‌కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొడంగల్ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కూలిపనులకు వెళ్లి.. పాముకాటుకు గురై..

● ప్రాణాపాయ స్థితిలో మహిళ

పెద్దేముల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కూలి పనులకు వెళ్లిన ఓమహిళను నాగుపాము కాటువేయడంతో ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లింది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని గాజీపూర్ గ్రామానికి చెందిన షకీలాబేగంది నిరుపేద కుటుంబం. రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితి వారిది. రోజూ మాదిరిగానే ఆమె వ్యవసాయ పనులకు కూలీకి వెళ్లింది. మధ్యాహ్నం దాహం వేయడంతో పొలంగట్టుపై పెట్టిన నీళ్లబాటిల్ తీసుకునేందుకు కింద చేయిపెట్టడంతో అక్కడే ఉన్న నాగుపాము ఆమెను కాటువేసింది. వెంటనే అక్కడ కూలీ పనులు చేస్తున్న ఇతర కూలీలు గ్రామస్థులకు సమాచారం ఇచ్చి 108 అంబులెన్స్‌ను పిలిపించారు. తాండూరు జిల్లాసుపత్రికి తరలించగా అక్కడ ప్రథమ చికిత్స చేసి పరిస్థితి విషమంగా ఉందని చెప్పి హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. దీంతో గ్రామస్థులు ఆమెను వికారాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. షకీలాబేగం భర్త మూడునెలల క్రితమే మృతిచెందాడు. ఆమెకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

తాండూరు రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉద్దండాపూర్ గ్రామంలో పేకాడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు కరన్‌కోట్ ఎస్‌ఐ రాథోడ్ వినోద్‌కుమార్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు గురువారం సిబ్బందితో దాడిచేసి వారిని పట్టుకుని, వారి నుంచి రూ.1914 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృత్యువాత

ధారూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేత మేస్తూ ఓ గేదె మృత్యువాతపడింది. ఈ ఘటన మండలంలోని నాగ్‌సాన్‌పల్లిలో గురువారం జరిగింది. రైతు రాములుకు చెందిన గేదె మేత మేస్తుండగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఉన్న విద్యుత్‌తీగకు తగిలి అక్కడికక్కడే మృతిచెందింది. నెలరోజుల క్రితం రాములు రూ.1.10లక్షలతో ఖరీదుచేసిన ఈగేదె మృతిచెందింది. రైతు రాములుకు ఆర్థిక సాయం మంజూరు చేసి ఆదుకోవాలని స్థానికులు ప్రభుత్వాన్ని కోరారు.

పక్కాగా జలవనరుల లెక్క!

(ఐదో పేజీ తరువాయి)

ఇటీవల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఎంపీఎస్‌వో, ఇరిగేషన్ ఏఈలు సూపర్‌వైజర్లుగా, జీపీవోలు, ఏఈవోలు, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఎన్యూమరేటర్లుగా వ్యవహరించనున్నారు. ఎన్యూమరేటర్లకు మండల స్థాయిలో శనివారం నుంచి మూడు రోజుల పాటు శిక్షణ ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ఎన్యూమరేటర్లను సమన్వయం చేసే బాధ్యతను మండలాల వారీగా తహసీల్దార్లకు అప్పగించారు. ఎన్యూమరేటర్ల శిక్షణ ముగిసిన తర్వాత జిల్లాలో జల గణన ప్రారంభించనున్నారు.

వ్యవసాయానికి, గృహావసరాలకే అధికం..

జిల్లాలో ఉపరిత జలాల్లో 80 శాతం వ్యవసాయానికి, 5 శాతం పరిశ్రమలు, మరో 6 శాతం గృహావసరాలకు, 9 శాతం ఇతర అవసరాలకు వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. ఏటా పెరుగుతున్న జనాభాతో నీటి వినియోగం కూడా అధికమవుతోంది. వ్యవసాయ, అనుబంధ ప్రయోజనాల కోసం తవ్విన బావులు, బోరుబావులు, నీరు లేని బోరు బావులతో పాటు చెరువులు, కుంటలు, ఎత్తిపోతల పథకాల సమాచారం సేకరించనున్నారు. ప్రస్తుత వినియోగ స్థితిగతులను కూడా నమోదు చేసుకోనున్నారు. చిన్ననీటి పారుదల మౌలిక సదుపాయాలను పెంపొందించేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించడానికి జల గణన ఉపయోగపడనుంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో చెరువులు, కుంటలు, జలాశయాలతో పాటు వివిధ నీటి వనరుల వివరాలను సేకరించనున్నారు. దీంతో నీటి పారుదల, మత్స్య సంపద, దేశీయ నీటి సరఫరా, పర్యావరణ సమతుల్యత, నీటి పారుదల పరిమాణం, పరిస్థితి, వినియోగం అంచనా వేయనున్నారు. తద్వారా నీటి వనరుల సంరక్షణ, నీటి పారుదల సామర్థ్యం మెరుగు పరచడం, ఉపరితల, భూగర్భ జల వనరుల పరిస్థితులను అంచనా వేసి జల సంరక్షణ చర్యలు చేపట్టనున్నారు.

టీ డయాగ్నొస్టిక్ హబ్‌కు జబ్బు

(ఐదో పేజీ తరువాయి)

పంపించగా ప్రాసెసింగ్ అనంతరం రిపోర్టులను అందజేస్తుంది. ఇందులో రక్త, మూత్ర, అవయవాల పనితీరు, థైరాయిడ్, లివర్, కిడ్నీ పనితీరు, కొలెస్ట్రాల్, చికున్ గున్యా, మలేరియా, డెంగీ, టైఫాయిడ్, క్యాల్షియం, సీరమ్ క్రియటివ్, డీహెచ్‌డీఎల్, తహెచ్‌బీఎస్‌హెచ్‌జీ, ఎలక్ట్రోరేట్స్ వంటి 57 రకాలు పరీక్షలు ఇక్కడ చేస్తారు.


వికారాబాద్ టీ డయాగ్నొస్టిక్ హబ్

బయోకెమిస్ట్రీ మిషన్‌లో

ఈ సెంటర్‌లో బయోకెమిస్ట్రీ మిషన్ పనిచేయక పోవడంతో ఎల్ఎఫ్‌టీ, ఆర్ఎఫ్‌టీ, లిక్విడ్ ప్రొఫైల్ ఆర్‌వీఎస్, హెచ్‌బీఏ1సీ, సీరమ్ ఎలక్ట్రానిక్, సీరమ్ యూరిక్ యాసిడ్, సీరమ్ క్యాల్షియమ్ తదితర పరీక్షలు అందుబాటులో లేని పరిస్థితి నెలకొంది. దీంతో గర్భిణులకు, డయాలిసిస్ రోగులకు ఇబ్బందికరంగా మారింది. గత ఐదు రోజులుగా మిషన్ పనిచేయక పోవడంతో ప్రజలు బయట రక్త పరీక్షలు చేయించుకోవాల్సి వస్తోంది.

చెట్ల కింద ఐకేపీ సిబ్బంది


చెట్ల కింద వేచియున్న ఐకేపీ సిబ్బంది

మర్పల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొనేందుకు వచ్చిన ఐకేపీ సిబ్బంది చెట్ల కింద వేచి యున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ చీరలు పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఐకేపీ సిబ్బందికి గురువారం తహసీల్దార్ కార్యాలయాల్లో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కానీ తహసీల్దార్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ అందుబాటులో లేకపోవడంతో చెట్లకింద రెండు గంటల పాటు వేచియున్నారు.

పత్తి రైతుల సమస్యలు పరిష్కరించాలి

పరిగి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో గురువారం పరిగి మండలం రంగంపల్లి శివారులోని కాటన్‌మిల్లు ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.వెంకటయ్య మాట్లాడుతూ.. సీసీఐ కేంద్రాల్లో కొర్రీలతో పత్తిని కొనడం లేదన్నారు. తేమ పేరుతో రైతుల పత్తిని తక్కువ ధరలకు కొంటున్నారని తెలిపారు. పత్తికి మద్దతు ధర రూ.8110లు ఉంటే, రూ.7800లు ఇస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎండీ హబీబ్, యాదగిరి, సత్తయ్య, శివ,మొగులయ్య, లాలయ్య, రమేశ్, శీను పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: పత్తి కొనుగోలులో సీసీఐ తేమశాతం పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయడం సరైంది కాదని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బుస్స చంద్రయ్య అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో గురువారం బొంరాస్‌పేట్ మండలంలోని తుంకిమెట్లలో నిరసన తెలిపారు. పత్తి రైతులకు గిట్టుబాటు ధరను కల్పించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ఎలాంటి కొర్రీలు లేకుండా పత్తి కొనుగోలు చేయాలన్నారు. నిరసనలో రమేశ్, శ్రీనివాస్, బాలప్ప, రైతులు రాంచంద్రయ్య, కృష్ణయ్య, మచ్చేందర్, భీమప్ప తదితరులు పాల్గొన్నారు.

కులాంతర వివాహ రక్షణ చట్టం తేవాలి

తాండూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మొయినాబాద్, షాద్‌నగర్ పోలీసుల నిర్లక్ష్యం వల్ల దళిత యువకుడు ఎర్ర రాజశేఖర్‌రెడ్డి హత్య జరిగిందని తక్షణమే ఆయన హత్యపై సిట్టింగ్ జడ్జి చేత న్యాయ విచారణ జరిపించాలని కుల వివక్ష పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య డిమాండ్ చేశారు. తాండూరు పట్టణం అంబేడ్కర్ విగ్రహం ఎదుట గురువారం కేవీపీఎస్ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూజిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కేఎస్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోకట్ చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు


కస్తూరిపల్లిలో పనులను పరిశీలిస్తున్న ఏఈఈ భాస్కర్

కొడంగల్ రూరల్, నవంబర్ 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా మండలంలో వివిధ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా కొనసాగుతున్నాయి. ఈ ఏడాది ఆగస్టులో లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలకు ముగ్గులు వేయగా బెస్‌మెంట్ వరకు పూర్తయిన పనులను హౌసింగ్ ఏఈఈ కానుగంటి భాస్కర్ గురువారం పరిశీలించారు.

విద్యార్థులకు గ్రాండ్ టెస్టు

బొంరాస్‌పేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బొంరాస్‌పేట్ జెడ్పీహెచ్ఎస్‌లో గురువారం 8వ తరగతి విద్యార్థులకు ఆదివారం గ్రాండ్ టెస్టు నిర్వహించారు. దేశ వ్యాప్తంగా జరిగే నేషనల్ మెరిట్ కమ్ మీన్స్ స్కాలర్ షిప్ పరీక్ష సందర్భంగా గత రెండు నెలలుగా విద్యార్థులకు ప్రతీరోజు తరగతులు నిర్వహిస్తున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎం, ఎంఈవో హరిలాల్, ఉపాధ్యాయులు ప్రశాంత్‌కుమార్, కాశయ్య, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ బాలల దినోత్సవం


పెద్దేముల్ జిల్లాపరిషత్ పాఠశాలలో బాలసభ

పెద్దేముల్, నవంబర్ 20(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని పెద్దేముల్ జెడ్పీహెచ్ఎస్‌లో బాలసభను నిర్వహించారు. కలెక్టర్ ఆదేశానుసారం బాలసభను నిర్వహించినట్లు ఎంపీడీవో రతన్‌సింగ్ తెలిపారు. విద్యార్థులకు క్రీడలు నిర్వహించారు. 27రకాల ప్రశ్న లతో కూడిన ప్రశ్నపత్రం ఇచ్చి వాటికి జవాబులు రాయించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పంచాయతీ అధికారి ప్రవీణ్‌కుమార్, తహసీల్దారు వెంకటేష్ ప్రసాద్, ఎంఈవో నర్సింగ్‌రావు, పాఠశాల హెచ్‌ఎం సునీతపాల్గొన్నారు.

మోమిన్‌పేట్: మేకవనంపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో గురువారం అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంఈవో మల్లేశం, ఎంపీవో యాదగిరి హాజరై విద్యార్థులకు వ్యాసరచన, ఆటల పోటీలు, గేయాలు తదితర పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గౌరీశంకర్, సుగుణ, రాంచందర్, విక్రమ్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

శామీర్‌పేట: శామీర్‌పేటలోని 4 అంగన్‌వాడీ కేంద్రాలల్లో గురువారం 7వ వార్షికోత్సవ వేడుకలను, బాలల దినోత్సవాన్ని హెచ్‌బీఎల్ ఇంజనీరింగ్ లిమిటెడ్ పరిశ్రమ సీఎస్ఆర్ ఎగ్జిక్యూటివ్ శ్రీధర్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున, ఘనంగా, ఆనందోత్సవాలతో నిర్వహించారు. హెచ్‌బీఎల్ సీఎస్ఆర్ ఎగ్జిక్యూటివ్ శ్రీధర్ విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

దుద్యాల్: హకీంపేట్ జెడ్పీహెచ్ఎస్‌లో గురువారం అంతర్జాతీయ బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు హకీంపేట్‌లో బాలల దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మండల పంచాయతీ అధికారి సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో విజయ రామారావు పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్: అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం సందర్భంగా కొడంగల్ శివారులో గల ఎంజేపీ గురుకుల పాఠశాల, కళాశాలలో గురువారం మండల పంచాయతీ అధికారి జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో బాలసభ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డ్రాయింగ్, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా బాలల సభ

మర్పల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అధికారులు 8, 9 తరగతుల విద్యార్థులు బాలసభ తూతూమంత్రంగా నిర్వహించారు. మండల స్థాయిలో అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాల్సి ఉన్నప్పటికీ ఎంపీవోతో పాటు పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో సభ నిర్వహించి చేతులు దులుపుకున్నారు.

బాల్యవివాహాల నిర్మూలనకు సహకరించాలి


పెద్దేముల్‌లో కళాజాత బృందంతో అవగాహన

పెద్దేముల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాల నిర్మూలనకు అందరూ సహకరించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత అన్నారు. మండల కేంద్రంలో గురువారం కళాకారుల బృందం పాటలద్వారా బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి కళాబృందం, అంగన్‌వాడీ టీచర్స్ లక్ష్మి, విజయలక్ష్మి, రేణుక, కమలాబాయి పాల్గొన్నారు.

కోట్‌పల్లి: బాల్య వివాహాలను అరికట్టాలన్న ఉద్దేశంతో గురువారం కోట్‌పల్లి మండల కేంద్రంలో మహిళా శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కళాజాతతో బాల్య వివాహాలపై ప్రజలకు అవగాహన ప్రదర్శన నిర్వహించినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జెస్సీ అన్నారు. ఈ కార్యక్రమంలో కళాకారులు చిరంజీవి, రవి, శారద, మాధురీదేవి, రవి, ప్రసాద్, వీరప్రసాద్, అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి, సుహాసిని, పాల్గొన్నారు.

స్పీకర్‌ను కలిసిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్‌యాదవ్



వికారాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా గెలుపొందిన నవీన్‌యాదవ్ తెలంగాణ రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అసెంబ్లీలో గురువారం స్పీకర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నవీన్‌యాదవ్‌ను స్పీకర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో లేజిస్లేటివ్ సెక్రటరీ డాక్టర్ వి.నరసింహాచార్యులు ఉన్నారు.

సంక్షిప్తంగా..

ఎన్నికల్లో గెలుపునకు కృషి చేయాలి

దోమ: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మేకల యాదయ్య, నాయకులు, కేఎస్ఆర్ ట్రస్టు చైర్మన్ శరత్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలో గురువారం బీజేపీకార్యకర్తలతో సమావేశం నిర్వహించారు

వార్డుల వారీగా కోర్ కమిటీ సమావేశాలు

తాండూరు: పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వార్డుల వారీగా కోర్ కమిటీ సమావేశాలు గురువారం నిర్వహించారు. వార్డుకు 10మంది చురుకైన వ్యక్తులను ఎంపికచేసి వారిద్వారా వార్డుకు అవసరమైన అత్యవసర పనులు గుర్తించి అధికారులకు సమన్వయం చేసే విధంగా వార్డుల వారీగా కోర్‌కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. అర్హులైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను గుర్తించడానికి కోర్ కమిటీ కీలకంగా వ్యవహరించనుంది.

జిల్లా ఆస్పత్రిలో నిలిచిపోయిన యూబీడీ సైట్

తాండూరు: మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో, జిల్లా ఆస్పత్రిలోని యూనిఫైడ్ బర్త్, డెత్ (యూబీడీ) సైట్ గత 15రోజుల నుంచి రావడంలేదని ఈసైట్ ద్వారా పిల్లల జనన, మరణ ధ్రువీకరణ నమోదు చేయడం నిలిచిపోయిందని జిల్లా ఆస్పత్రి, మాతా శిశు ఆరోగ్య కేంద్రం మెడికల్ సూపరిండెంట్ జి. వినయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు.

మోసపూరిత లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

మోమిన్‌పేట్: వాట్సాప్‌లో మోసపూరిత లింకుల ద్వారా ఆర్‌టీఏ ఏపీకే అనే సాఫ్ట్‌వేర్ (మాల్వేర్)ఫైల్స్ వస్తే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని మోమిన్‌పేట్ సీఐ వెంకట్ అన్నారు. మోమిన్‌పేట్, మర్పల్లి, నవాబుపేట్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ఈ ఫైల్‌ను వాట్సాప్ ద్వారా పంపుతూ ఇది ఆర్‌టీఏ అధికారిక యాప్ అనే పేరుతో మోసం చేస్తున్నారని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఆర్టీసీ కంట్రోలర్‌ను నియమించాలి

నవాబుపేట: వికారాబాద్ నుంచి నవాబుపేట మధ్య పెట్రోల్‌బంక్ వద్ద ఆర్టీసీ అధికారులు కంట్రోలర్‌ను నియమించాలని ఉద్యోగులు కోరుతున్నారు. ఎంఆర్‌పీ చౌరస్తా మీదుగా బస్సుల్లో వందలాది మంది ప్రయాణికులు రాకపోకలు కొనసాగిస్తుంటారని 15రోజులుగా అక్కడ కంట్రోలర్ లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని వాపోయారు.

అప్పాయిపల్లిలో ఉచిత వైద్యశిబిరం

కొడంగల్ రూరల్: గ్రామాల్లో నిర్వహించే టీబీ ముక్త్ భారత్ అభియాన్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని అంగడిరైచూర్ ప్రాథమిక కేంద్రం వైద్యురాలు బుష్రాఫాతిమా అన్నారు. అప్పాయిపల్లిలో గురువారం టీబీముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. మొత్తం 123మందికి వైద్యపరీక్షలు చేశారు.

రైతులకు సబ్సిడీపై ట్రాక్టర్ రోటవేటర్

మేడ్చల్ టౌన్: మేడ్చల్ రైతు సహకార సంఘం పరిధిలో ట్రాక్టర్ ఉన్న రైతులకు సబ్సిడీపై రోటవేటర్ అందజేస్తున్నామని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.

వ్యాయామంతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

ఘట్‌కేసర్ రూరల్: ప్రతిరోజు గంటసేపు వ్యాయామం చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అనురాగ్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగు డీన్ విజయ్‌కుమార్ తెలిపారు. అనురాగ్ యూనివర్సిటీ, నీలిమా ఆస్పత్రి సంయుక్తంగా నిర్వహించిన ఉచితవైద్యశిబిరంలో అనురాగ్ యూనివర్సిటీ సిబ్బంది, డ్రైవర్లు పాల్గొని వైద్యపరీక్షలు చేయించుకున్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

పరిగి: శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తేజస్ నెట్‌వర్క్ సహకారంతో మండలంలోని 50 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులకు ప్రేరణ ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాలపై శిక్షణ ఇచ్చారు. ఇన్‌చార్జి ఎంఈవో గోపాల్, రిసోర్స్ పర్సన్‌లు వెంకటప్రసాద్, స్వప్న, సంస్థ మోంటార్స్ తుల్జప్ప, కవిత, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పేదింటి ఆడ పడుచులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

దుద్యాల: పేదింటి ఆడపడుచుల పెళ్లిలకు ప్రభుత్వం ఆర్థికసాయం అందిస్తూ అండగా ఉంటుందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. హస్నాబాద్ గ్రామానికి చెందిన 8 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భీములు యాదవ్ పాల్గొన్నారు.

సుప్రీం కోర్టు తీర్పుపై రివ్యూ పిటిషన్ వేయాలి

బొంరాస్‌పేట్: ఉద్యోగ విరమణకు ఐదేళ్లకు మించి సర్వీసు ఉన్న ఉపాధ్యాయులు రెండేళ్లలో తప్పనిసరిగా టెట్ ఉత్తీర్ణులు కావాలని లేదా ఉద్యోగం నుంచి రిటైర్డ్ కావాలని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై రివ్యూ పిటిషన్ వేయాలని యూటీఎఫ్ నాయకులు అన్నారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఉపాధ్యాయుల ప్రయోజనాలను కాపాడేందుకు తీర్పును పున సమీక్షించాలని కోరారు. ఈ సమావేశంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు గౌరారం గోపాల్, ఎండీ.అలీముద్దీన్ ఉన్నారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి

దోమ: వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలని దోమ తహసీల్దార్ గోవిందమ్మకు గురువారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏలు మాట్లాడుతూ 61 సంవత్సరాలు నిండిన వీఆర్‌ఏల వారసులకు విద్యార్హతను బట్టి ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు.

జిల్లా స్థాయిలో గుర్తింపు తీసుకువస్తాం

కులకచర్ల: కులకచర్ల మార్కెట్‌ను జిల్లా స్థాయిలో గుర్తింపు తీసుకువస్తామని మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు అన్నారు. మార్కెట్ కార్యాలయంలో గురువారం మార్కెట్ కమిటీ పాలకవర్గ సమావేశం నిర్వహించారు. రూ.50లక్షలతో మార్కెట్ నూతన కార్యాలయ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేస్తారన్నారు.

ఓటర్ జాబితా పరిశీలన

తాండూరు రూరల్ , నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తాండూరు తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలు తయారు చేస్తున్న ఎలక్ట్రికల్ మ్యాప్‌ను సబ్‌కలెక్టర్ ఉమా శంకర్‌ప్రసాద్ పరిశీలించారు. తహసీల్దార్ కార్యాలయంలో గురువారం తాండూరు నియోజకవవర్గంకు చెందని బీఎల్‌వోలు తయారుచేస్తున్న జాబితాను క్షుణ్ణంగా పరిశీలించారు. మ్యాపింగ్ పనితీరుపై సబ్‌కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్ తాండూరు తహసీల్దార్ తారాసింగ్‌ను అడిగి తెలుసుకున్నారు. తాండూరు నియోజకవర్గంలో 269 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వాటిలో కొన్ని పోలింగ్ కేంద్రాల్లో, ఓటర్ మ్యాపింగ్ పూర్తయిందని తెలిపారు. మిగిలిన బీఎల్‌వోలలకు కార్యాలయానికి రప్పించి శిక్షణ అందిస్తున్నట్లు తహసీల్దార్ తారాసింగ్ తెలిపారు. ఆయన వెంట ఎన్నికల అధికారి దీప్తి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.


యాలాల పోలీస్‌స్టేషన్‌లో తనిఖీ

యాలాల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): యాలాల పోలీస్ స్టేషన్‌ను గురువారం తాండూరు డీఎస్పీ నర్సింగ్‌యాదయ్య గురువారం తనిఖీ చేశారు. అక్కడ పోలీస్‌లతో పనితీరుపై సమీక్షించారు. వచ్చే లోకల్ బాడీ ఎన్నికల్లో విధుల నిర్వాహణపై మాట్లాడారు. కేసులను పెండింగ్‌లో లేకుండా చూడాలని పేర్కొంటూ రికార్డులను పరిశీలించారు. ప్రతీరోజు వాహనాల తనిఖీ చేయాలని, కేసులు పెండింగ్‌లో లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎస్‌ఐ విఠల్‌రెడ్డి ఉన్నారు.

వీఆర్‌ఏల వారసులను ఆదుకోవాలి

బంట్వారం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వీఆర్‌ఏఏల వారసులకు ఉద్యోగాలు ఇచ్చి ఆదుకోవాలని వీఆర్‌ఏల సంఘం మండల అధ్యక్షుడు అంజిలయ్య, నర్సిములు, కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. 61సంవత్సరాల పైబడిన వీఆర్‌ఏల వారసులను గత ప్రభుత్వం ఆదుకోలేదన్నారు. గతంలో తాము రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమించిన నేపథ్యంలో నాటి ముఖ్యమంత్రి జీవో 81, 85, ప్రకారం తమకు ఉద్యోగాలు వస్తాయనే ఆశతో రెండు సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం తమ డిమాండ్లను పరిగణంలోకి తీసుకుని తమకు వీఆర్‌ఏలకు ఉద్యోగాల్లో సర్దుబాటుచేసి ఆదుకోవాలని కోరారు.

ఎంపీ కొండాకు పరామర్శ


ఎంపీతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

వికారాబాద్/మర్పల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవలే గుండె శస్త్రచికిత్స చేయించుకున్న చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. బీజేపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్లనందు నేతృత్వంలో గురువారం నియోజకవర్గ బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా వెళ్లి పరామర్శించారు. ఎంపీని కలిసిన వారిలో ఆయా మండలాల అధ్యక్షులు రామేశ్వర్‌రెడ్డి, రాజునాయక్, ఆశిరెడ్డి, నాయకులు, రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షులు బొక్క నర్సింహారెడ్డి, నాయకులు భుజంగారెడ్డి, మాజీ సర్పంచ్ యాదవరెడ్డిలు ఉన్నారు.


ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని పరామర్శించిన బీజేపీ నాయకులు